క్లుప్తంగా

దాళ్వాకు విత్తనాల పంపిణీ

మలికిపురం: మలికిపురంలో దాళ్వా సాగు చేస్తున్న రైతులకు 153 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.రాకేశ్ తెలిపారు. సార్వా సాగు లేని ప్రాంతాల్లో రైతులు ముందస్తు దాళ్వా వేస్తున్న నేపథ్యంలో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు.

6న రక్తదాన శిబిరం

మామిడికుదురు: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6న రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని సంఘం అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 6వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

నిబంధనలకు అనుగుణంగా తూరలు వేస్తాం

అంబాజీపేట: మాచవరం దొమ్మేటివారిపాలెం వినాయకుని గుడి వద్ద ప్రధాన రహదారి మధ్యలో శిథిలమైన తూరలను తొలగించి నిబంధనల మేరకు నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ జి.తాతారావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తూరలు ఏర్పాటు చేయడంతో స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. నిలిచిన పనులపై ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర, జేఈలు మంళవారం పరిశీలించారు. తూరల పనులను పునరుద్ధరించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులు చేపడతామన్నారు.

వైభవంగా లంకాలమ్మ పంట జాతర

అంబాజీపేట: ముక్కామలలో వేంచేసిన లంకాలమ్మ పంట జాతరను మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏటా అమ్మవారి పంట జాతర ఉత్సవాన్ని ఘనంగా జరుపుతారు. పంటలు బాగా పండాలని, సిరి సంపదలతో సంతోషంగా ఉండాలంటూ అమ్మవారి పూజా ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత నరసింహమూర్తికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీధర నరసింహమూర్తి మంగళవారం రూ.10,001 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్, ఆర్డీఓ పి.శ్రీకర్

అయినవిల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్ అన్నారు. మంగళవారం ఎన్నికల అబ్జర్వర్ హర్షవర్ధన్, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్‌తో కలసి అయినవిల్లి మండల పరిషత్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. హర్షవర్ధన్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 113 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 16 వేల మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఎంపీడీఓ జి.భీమరాజు తదితరులు ఉన్నారు.

జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తు

కొత్తపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ యాళ్ల లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్టులో 50% మార్కులు కలిగి ఉండాలన్నారు. నెలకు రూ 10,000 జీతం నిర్ణయించమన్నారు. అలాగే ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆరో తేదీ లోగా దరఖాస్తు, సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలలో అందజేయాలన్నారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

టాయిలెట్ హమాలీకి దరఖాస్తు

రావులపాలెం: స్థానిక జూనియర్ కళాశాలలో టాయిలెట్ హమాలీగా పనిచేయుటకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.వెంకటరమణ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ లోపు సంబంధిత సర్టిఫికెట్లతో కాలేజీలో హాజరు కావాలన్నారు. నెలకు జీతం రూ.6000 ఇస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రమాదకరంగా ఏటిగట్టు మార్గం

- రోడ్డు మరమ్మతులు లేవు
- డొంకలు, తుప్పలతో అవస్థలు
- ప్రయాణికులకు ఇబ్బందులు



గ్రామస్తుల చందాలతో తొలగిస్తున్న పెదతిప్ప ఏటిగట్టు రోడ్డు డొంకలు

మలికిపురం: మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ప్రజలు అత్యధికంగా వినియోగించే ఏటిగట్టు మార్గాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. పెదతిప్ప ఏటిగట్టు రోడ్డుతో పాటు సఖినేటిపల్లి-టేకిశెట్టిపాలెం ఏటిగట్టు రోడ్లు కూడా మిక్కిలి అధ్వానంగా ఉన్నాయి. మలికిపురం నుంచి పెదతిప్ప మీదుగా రామరాజులంక వరకూ సుమారు రెండు కిలోమీటర్లు పొడవుంటుంది. సఖినేటిపల్లి మండలం ప్రజలకు దిండి-చించినాడ వంతెన మీదుగా పశ్చిమగోదావరి జిల్లా వెళ్లేందుకు ఈ రోడ్డు దగ్గరి మార్గం. సుమారు 22 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రోడ్డు ప్రస్తుతం పూర్తిగా పాడైపోయింది. నాలుగేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ హయాంలో రూ.40 లక్షలతో రోడ్డు వేశారు. కానీ ప్రస్తుతం డొంకలతో నిండిపోయింది. వాహనాల రాక పోకలు అటుంచితే కనీసం నడవడానికే కష్టంగా ఉంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును ఆనుకుని అనేక వ్యవసాయ పొలాలు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కూడా ఈ రోడ్డును వినియోగిస్తారు. దీంతో ఇటీవల పెదతిప్ప ప్రాంత ప్రజలు చందాలతో తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ రోడ్డుపైకి వెళ్లే వంతెన కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు. మలికిపురంలో ఏటిగట్టు పైకి వెళ్లే వంతెన సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం శిథిల స్థితికి చేరింది. ఈ రోడ్డు, వంతెనల పునర్నిర్మాణం ఏటిగట్టు వెడల్పు పనులతో ముడిపడి ఉంది. దీంతో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. దిండి నుంచి సఖినేటిపల్లి మీదుగా ఏటిగట్టు పనులు జరగాల్సి ఉంది. మాజీ సీఎం రాజశేఖరరెడ్డి మృతి అనంతరం ఏటిగట్టు పనులే నిలిచిపోయాయి. దీంతో ఏటిగట్టు రోడ్ల పనులు లేక శిథిలం అయ్యాయి. సుమారు 15 ఏళ్లుగా పనులు జరగడం లేదు. ఈ రోడ్డు వంతెనలు కూడా పదేళ్లుగా ప్రమాదకరంగానే ఉన్నాయి. దగ్గరి మార్గం కావడంతో ప్రయాణికులు గత్యంతరం లేక ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఏటిగట్టు పనుల జాప్యం వల్ల మలికిపురం పెదతిప్ప వంతెనతో పాటు, దిండి టూరిజం కేంద్రానికి వెళ్లే రోడ్డు కూడా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఇక్కడ కూడా టూరిజం కేంద్రానికి వెళ్లే భారీ వాహనాలు, టూరిస్టు బస్సులు కూడా ఆర్‌అండ్‌బీ రోడ్డు పైనే నిలిపి వేయాల్సి వస్తుంది. పైగా ఇక్కడ ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడా చాలా ఇరుకు. ఇక్కడ కూడా వాహనాలు నిలిపితే ఇతర వాహనాల రాకపోకలకు కష్టం అవుతుంది. అలాగే రామరాజులంక పుష్కర ఘాట్‌కు వెళ్లే రోడ్డు, పెదతిప్ప నివాస ప్రాంతాలకు వెళ్లే రోడ్డు, గండిపేటలో అప్పనరాముని లంక వెళ్లే రోడ్డుకు ర్యాంపులు కూడా బలహీనంగా ఉన్నాయి. ఇక్కడ మెరక పనులు చేయకపోవడం వల్ల వరద సమయంలో నీరు వెలుపల వైపునకు వస్తుంది. ఇక్కడ మెరక చేయాల్సి ఉన్నప్పటికీ అది కూడా ఏటిగట్టు అభివృద్ధి పనుల పెండింగ్ వల్ల జాప్యం జరుగుతోంది. ఏటిగట్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయో? ఈ వంతెనలు, రోడ్లు పనులు ఎప్పుడు జరుగుతాయోనని ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రోడ్డును తక్షణం నిర్మించాలి



ఏటిగట్టు రోడ్డు అధ్వానంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రైతులు, వ్యవసాయ కూలీల రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని రోడ్డు పునర్నిర్మించాలి.

– దేశినీడి ఉదయ భాస్కరరావు, రామరాజులంక

నాక్ సర్వేకు నాలుగు స్కూల్స్ ఎంపిక



మామిడికుదురు ఎమ్మార్సీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

మామిడికుదురు: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏసీ) సర్వేకు నగరం, పాశర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు నగరం ఎడ్యుకేర్, శ్రీచైతన్య స్కూల్స్‌ను ఎంపిక చేశారు. 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థుల ఇంగ్లిషు, మ్యాథ్స్, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన అంశాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. మామిడికుదురు ఎమ్మార్సీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కాన్ఫరెన్స్‌కు నాలుగు స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈఓలు ఎస్‌వీవీ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు పాల్గొన్నారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు పరీక్ష నిర్వహణ తదితర అంశాలపై సలహాలు, సూచనలు అందించారు.

పూల సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన



వెలిచేరులో పూల రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపేట: పూల పంటల్లో తెగుళ్లు, పురుగులను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడం, తగిన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చని పూల పంటల పరిశోధన శాస్త్రవేత్తలు ఆ రైతులకు సూచించారు. వేమగిరి ఐసీఏఆర్ డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరీకల్చర్ రీసెర్చ్, రీజినల్ స్టేషన్ శాస్త్రవేత్తలు డాక్టర్ డీవీఎస్ రాజు (ఉద్యాన విభాగం), డాక్టర్ మాధవన్ (తెగుళ్ల విభాగం), డాక్టర్ శిరీష్ (నులిపురుగుల విభాగం), డాక్టర్ లక్ష్మీపతి (కీటక విభాగం), స్థానిక ఉద్యాన అధికారి డాక్టర్ జి.కోటేశ్వరరావు సంయుక్తంగా ఆత్రేయపురం మండలం వెలిచేరులో పర్యటించారు. పూల పంటలైన లిల్లీ, కనకాంబరం, కాగడాల మల్లె, గులాబీ, బంతి, చామంతి తదితర పొలాలను సందర్శించి, పూల రైతులకు సస్యరక్షణ, పోషక యాజమాన్యం, తెగుళ్లు, వాటి నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణాధికారులు పి.రాజు, ఎం.సౌమ్య, ఉద్యాన సహాయకులు బి.బేబీషాలిని, ఎ.హరిప్రియ, పూల రైతులు మిద్దే సత్యనారాయణ, వేగేశ్న సత్యనారాయణరాజు, పి.వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు ఏ కష్టమొచ్చినా తోడుగా ఉంటాం



గోగన్నమఠం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ సీనియర్ నేత భూపతిరాజు సత్తిబాబురాజు ఆధ్వర్యంలో మంగళవారం గోగన్నమఠంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు హామీలు ఇచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ప్రస్తావన తీసుకురావడం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు ఏ కష్టం వచ్చిన తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి చెందడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలతో జగన్ ప్రజల మనస్సులు గెలిచారన్నారు. ఏ ఎన్నికలు జరిగినా వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు పార్టీ నేతలను సమాయత్తం చేస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కట్టా శ్రీను, కుసుమ చంద్రశేఖర్, నేతలు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, పాటి శివకుమార్, భూపతిరాజు సతీష్‌రాజు, తాడి సహదేవ్, కటకంశెట్టి ఆదిత్య, సాగి సత్యనారాయణరాజు, కూనపరెడ్డి రాంబాబు, ఎండీవై షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్విట్ శత జయంతి



దివ్యాంగులకు దుస్తులు అందజేసిన ఎల్ఐసీ యూనియన్ నాయకులు

రాజోలు: ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు శ్రీధర్ వాసుదేవ్ కల్విట్ శత జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ ఎంవీవీకే దుర్గారావు, ఎన్.ప్రభాకరరావులకు సత్కరించారు. స్థానిక వివేకానంద మనోవికాస కేంద్రం దివ్యాంగులకు భోజన సదుపాయం కల్పించి దుస్తులు పంపిణీ చేశారు. రాజోలు ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. నాగుల్లంక వృద్ధాశ్రమం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎస్ఏ నాయుడు, కార్యదర్శి టి.రాంబాబు, రాజమండ్రి డివిజన్ సంయుక్త కార్యదర్శి కె.కిషోర్‌కుమార్, రాజోలు బ్రాంచి మేనేజర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, సిద్ధార్థకుమార్, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చైన్ చోరీకి పాల్పడింది దగ్గరి బంధువే

మామిడికుదురు: చుట్టపు చూపుగా వచ్చి వెళుతూ బంధువు మెడలో బంగారం వస్తువులు చూసి వాటిని కాజేయాలన్న దురుద్దేశంతో మరో స్నేహితుడితో కలసి చైన్ చోరీ చేసిన ముద్దాయిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ కథనం మేరకు వివరాలు ఇవి. మామిడికుదురు బండారు వారి వీధికి చెందిన 71 ఏళ్ల అడబాల శేషకుమారి మెడలో బంగారు గొలుసు గత నెల 29న చోరీకి గురైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా మంగళవారం అప్పనపల్లి నుంచి పాశర్లపూడి వైపు వస్తున్న అనుమానితుడిని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. శేషకుమారికి దగ్గర బంధువైన కల్వకొలను హేమంత్‌కుమార్ 15 ఏళ్ల క్రితం మామిడికుదురు నుంచి పెనమలూరు మండలం తాడిగడప గ్రామం వెళ్లి అక్కడ టీ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అప్పుడప్పుడు శేషకుమారిని చూసేందుకు వచ్చి వెళుతూ ఆమె మెడలోని బంగారు వస్తువులు దొంగిలించాలన్న దురుద్దేశంతో అతనితో కలిసి హోటల్లో పని చేసే మరో స్నేహితుడితో కలిసి పథకం ప్రకారం ఇంట్లో మగవాళ్లు ఎవరూ లేని సమయంలో దొంగతనానికి పాల్పడ్డారు. హేమంత్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి బంగారం గొలుసు రికవరీ చేశామని, రెండో ముద్దాయి కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులంకలో ఇసుక అక్రమ రవాణాను మంగళవారం రాత్రి గ్రామస్తులు అడ్డుకున్నారు. గత కొంత కాలంగా ఈ ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగడంపై గ్రామస్తులు ఆగ్రహించారు. తమ అవసరాలకు ఇసుక లేదని చెప్పి అక్రమంగా ఇసుక ఎలా తరలిస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకో నిబంధన మీకో నిబంధన అంటూ వారు ఇసుక అక్రమార్కులపై మండిపడ్డారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి ఇసుకలోడుతో సహా అడ్డుకుని అయినవిల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై పి.శ్రీనివాసరావు సిబ్బందితో చేరుకుని ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలకు తహసీల్దార్ కార్యాలయానికి తరలిస్తామన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి



కొత్తపేట భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ హరిప్రసాద్



ఆలమూరు డిగ్రీ కళాశాలలో దివ్యాంగ ప్రిన్సిపాల్ నరసింహస్వామిని ఘనంగా సత్కరిస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

మామిడికుదురు: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని సమగ్ర శిక్ష సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మామిడికుదురు ఎమ్మార్సీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓలు ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, ఎం.వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్వో వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు, ఐఈఆర్‌పీలు కె.సుశీల, ఎస్.హిమబిందు, విద్యార్థులు, పేరెంట్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని మామిడికుదురులో జరిగిన మదర్‌థెరిసా వికలాంగుల సంక్షేమ సంఘం సమావేశం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షులు గుర్రం శ్రీను, కార్యదర్శి కొంబత్తుల ఏడుకొండలు, సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దివ్యాంగ విద్యార్థులు సమాజంలో అందరితో సమానంగా పోటీ పడాలని, అందుకు అందరూ సహకరించాలని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కె.లీలావతి సూచించారు. మంగళవారం స్థానిక గౌతమి నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.సుభాష్‌చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు ఓర్పు, సహనంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, మానసికంగా, శారీరకంగా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు గౌతమినగర్‌కు చెందిన మట్టపర్తి శాంతకుమారి ప్రత్యేకంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, ఐఈడీఎస్ఎస్ టీచర్ కె.లక్ష్మీకుమారి, ఐఈఆర్‌టీలు సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, సీఆర్‌పీలు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి వారి హక్కులు కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. మాచవరం భవిత సెంటర్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఐఈఆర్టీ ఎస్‌కే బేగం అధ్యక్షతన మంగళవారం జరిగింది. భవితా సెంటర్‌లో బెస్ట్ పేరంట్స్‌ను ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. అలాగే ఐఈఆర్టీ బేగంను పలువురు సన్మానించారు. అంతకుముందు కేకు కట్‌చేసి పలువురికి పంచారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కడలి సాయిరామ్, నాగజ్యోతి, తొండవరం క్రాఫ్ట్ టీచర్ ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి భవిత సెంటర్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ శ్రీనివాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగులు దేనిలోనూ తక్కువ కాదని తల్లిదండ్రులు, టీచర్స్ వారిని ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. భవిత సెంటర్ ఐఈఆర్‌టీలు వేంకటేశ్వరరావు, సౌజన్య మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకి ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందని, దివ్యంగా పిల్లలు ఎక్కడ ఉన్నా భవిత సెంటర్‌లో జాయిన్ చేయాలని తెలిపారు. అనంతరం దివ్యాంగ ఉపాధ్యాయుడిని సత్కరించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అనిల్ కుమార్, సీఆర్‌ఎంటీలు వెంకట్, చంద్రరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు మాట్లాడుతూ ఎంతో మంది దివ్యాంగులు యూపీపీఎస్సీ వంటి పరీక్షల్లో విజయం సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. దివ్యాంగులు పట్టుదల, ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే అంగవైకల్యం విజయాలకు ఏ మాత్రం అడ్డుకాదన్నారు. దివ్యాంగులైన విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ సాయిబాబును సత్కరించారు. రోటరీ ప్రతినిధి దార్ల పెదబాబు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓ నల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: దివ్యాంగ విద్యార్థులు ఆత్మన్యూనతా భావాలకు లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ బూసి విద్యాప్రసన్న కోరారు. స్థానిక భవిత సెంటర్‌లో ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం జరిగింది. దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు కోరారు. అనంతరం భవిత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏజీపీ విద్యాప్రసన్న, వెర్రియ్య దంపతులు వాటర్ బాటిల్స్,. పండ్లు అందజేశారు. ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దివ్యాంగుడైన ప్రిన్సిపాల్ వి.నరసింహస్వామికి గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో అధ్యాపక బృందం దుశ్శాలువా వేసి పూలమాలలతో సత్కరించింది.

రావులపాలెంలో..

రావులపాలెం: స్థానిక భవిత సెంటర్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు నాగకుమార్, శ్రీనివాసరాజుల అధ్యక్షత నిర్వహించి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ ముక్తేశ్వరరావు హాజరయ్యారు. వివిధ పోటీలు నిర్వహించి దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వహకుడు దిడ్ల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దాతలు దివ్యాంగులకు అన్నదానం చేశారు.

ఆలమూరు మండంలోని పంచాయతీ కార్యదర్శులు

గ్రామం	కార్యదర్శులు	ఫోన్ నంబర్లు
ఆలమూరు	కె.మోక్షాంజలి (గ్రేడ్-1)	98487 75186
సంధిపూడి	ఎస్.వీర్రాజు (గ్రేడ్-1)	83748 47330
పినపళ్ల	ఎస్.వీర్రాజు (గ్రేడ్-1)	83748 47330
పెదపళ్ల	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
చింతలూరు	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
సూర్యారావుపేట	కె.హరేరామ్‌రెడ్డి	94928 31392
కలవచర్ల	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
పెనికేరు	జె.అయ్యన్న	93948 45937
నవాబుపేట	ఎస్.రాబాబు	63034 87949
నర్శిపూడి	కె.కృష్ణ	94949 04849
చొప్పెల్ల	ఎం.వెంకటరెడ్డి (గ్రేడ్-1)	99519 32244
బడుగువానిలంక	ఎం.వెంకటరెడ్డి (గ్రేడ్-1)	99519 32244
జొన్నాడ	సీహెచ్.సుభాష్	83418 16561
చెముడులంక	సీహెచ్.సుభాష్	83418 16561
మూలస్థాన అగ్రహారం	చిక్కాల వీరమాత	84065 66729
మడికి	బి.వెంకటరత్నం (గ్రేడ్-1)	99485 88418
మోదుకూరు	కె.సాయి ప్రసాద్ (గ్రేడ్-1)	94413 91824
గుమ్మిలేరు	కె.సాయి ప్రసాద్ (గ్రేడ్-1)	94413 91824

ఆలమూరు మండలంలోని వీఆర్వోల నంబర్లు

గ్రామం పేరు	రెవెన్యూ అధికారులు పేర్లు	ఫోన్ నంబర్లు
ఆలమూరు-1	జి.సత్యప్రసాద్	80083 25767
ఆలమూరు-2	సీహెచ్ భారతి	99088 02042
సంధిపూడి	టి.రమేష్	96187 96775
పినపళ్ల (ఇన్‌చార్జ్)	బి.ఉదయ్‌కుమార్	94942 27127
పెదపళ్ల	బి.ఉదయ్‌కుమార్	94942 27127
చింతలూరు	కె.రాజశేఖర్	99498 43666
సూర్యారావుపేట (ఆలమూరు-3)	పి.సుజాత	85000 02047
పెనికేరు	టి.రాంబాబు	97044 68600
కలవచర్ల (పెనికేరు-2)	కె.స్వామినాయుడు	79817 99743
నర్శిపూడి	బి.యేసేపు	94944 97838
బడుగువానిలంక	ఎస్.సిద్ధార్థ్‌కుమార్	99121 22128
జొన్నాడ-1	టి.రామకృష్ణ	79898 30831
జొన్నాడ-2 (ఇన్‌చార్జ్)	టి.రామకృష్ణ	79898 30831
చెముడులంక-1	టి.సూర్యప్రకాష్	90006 76439
చెముడులంక-2	జి.నాగజ్యోతి	86883 05406
మూలస్థాన అగ్రహారం-1	ఎ.శ్రీనివాసరావు	98489 05599
మూలస్థాన అగ్రహారం-2	సీహెచ్ రవికుమార్	94908 43559
మడికి-1	ఎస్.కొండలరావు	97043 35183
మడికి-2	డి.సుదర్శన్‌రావు	75692 47225
మడికి-3	ఎస్.వెంకట్రావు	99493 40789
మోదుకూరు	కట్టా ప్రసాద్	99519 13332

యోగా సభ్యుల రక్తదానం

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు మంగళవారం రక్తదానం చేసినట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. 42 మంది తమ సభ్యులు రక్తదానం చేశారన్నారు. దీంతో ఇప్పటివరకూ 20 వేల మందికి తమ సభ్యులు రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు.